# మరబొమ్మ

విడవకుండా నాలుగు రోజుల నుండి కురిసిన నాన్పుడు వానతో గుంటల్లో నీళ్ళు నిలిచి రోడ్లన్నీ చీదరగా వున్నాయి. ప్రక్క వీధిలో వున్న వదినగారింటికి బయల్దేరిన రేణుక బురద నీళ్ళు చీర మీద చిందకుండా జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. మధ్య దారిలోకి వచ్చాక సన్నటి చినుకులు మొదలయ్యాయి.

"అయ్యో! అలా తడిచిపోయావేంటి రేణూ?" తలుపు తెరిచిన భవాని గబగబా టవల్ తెచ్చి రేణుకను కుర్చీమీద కూర్చోబెట్టి తల తుడవసాగింది. "జలుబు చేస్తుందన్న భయం లేదు. యింకా నీకు వర్షంలో తడిచే సరదా పోలేదు. అమ్మమ్మవయినా చిన్నపిల్ల చేష్టలు పోలేదు నీకు రేణూ!" అప్యాయంగా విసుక్కుంటూన్న వదిన గారి పైట చెంగుతో ముఖం తుడుచుకుంటూ చిన్నగా నవ్వింది రేణుక. ఆహ్లాదకరమైన ఆ నవ్వుతో యిద్దరి మనసులు గతంలోకి, ముప్పయి ఐదేళ్ళ వెనక్కి, భవాని నవవధువుగా వచ్చిన నాటి రోజుల్ని స్పర్శిస్తూ వెళ్ళాయి.

అప్పుడే రేకలు విప్పుకుంటున్న కుసుమంలా కోటి ఆశలతో పరిమళిస్తూ తమ యింట అడుగు పెట్టిన భవాని రూపం రేణుక కళ్ళ ముందు నిలిచింది. ఎంతటి సౌకుమార్యం! మరెంతటి భావుకత! ఎంతటి చైతన్యం! ఎంతటి సృజనాత్మకత తొణికేవి ఆమెలో!! కానీ ఒక్క రెండు సంవత్సరాల్లో ఆమెలో ఎంత మార్పు? వడిలిన పారిజాతంలా, మూగవోయిన విపంచిలా, ఎండిన సరస్సులా, రెక్కలు తెగిన పక్షిలా మారిపోయిన వదినను చూచి తన హృదయం ఆక్రోశించేది. అడుగడుగునా చిన్నప్పటినుంచి తనను 'ఆడదానివి' అంటూ అదుపు చేసిన తన అన్న, వదిన ఆలోచనల్ని, అనుభూతుల్ని, ప్రవర్తనను ఎంతగా అదుపు చేసి ఆమెలోని చైతన్యాన్ని, సృజనాత్మకతలను చంపేసాడో తనకు తెలుసు. అజ్ఞానంతో, మూర్ఖత్వంతో అమ్మ, అహంకారంతో నాన్న అన్న చేష్టలకెలా వంతపాడేవారో కూడా తనకు తెలుసు. వదిన పక్షాన నిలబడి వాళ్ళ నియంతృత్వాన్ని, అధికారాన్ని ప్రశ్నించిన తననెంత అవమానకరంగా దూషించారో కూడా తనకు గుర్తుంది. భార్య శిరస్సు ఎత్తేలోగానే చావు దెబ్బ కొట్టి పాదాల కింద నొక్కి వుంచాలనే పురుషస్వామ్య సూక్తిని నమ్మిన అన్న అధీనంలో వదిన స్వేచ్ఛను కోల్పోయింది. తనూ ఒక వ్యక్తిననే స్పృహను కోల్పోయింది. తను మనసారా కోరుకునే జీవితాన్ని కోల్పోయి తనది కాని జీవితంలో యిమిడిపోయింది. అదంతా కళ్ళ ముందు కదిలి రేణుక హృదయం భారంగా అయింది.

తను కాపురానికి వచ్చిన తొలి రోజులు భవానికి కూడా గుర్తుకొచ్చాయి. అత్త వారింట్లోకి ఆశల పల్లకి ఎక్కి వచ్చిన తనకు సంతోషంగా స్వాగతం పలికిన తన ఆడపడుచు రేణుక కొద్దిరోజుల్లోనే తన ప్రాణమిత్రురాలయింది. పుట్టింట్లో తనేమంత అల్లారు ముద్దుగా పెరగక పోయినా అత్తవారింట్లో ఎదురైన నిరాదరణ ఊహించనిది, అలవాటు లేనిది. అడుగడుగునా తనకు ఎదురయిన అవమానా

లకు, తనను శాసించిన కాఠిన్యానికి బెదిరిపోయిన తను, రేణుక వల్లే ధైర్యాన్ని కూడదీసుకుంది. జీవితం గురించి తను పెంచుకున్న ఆశావిహంగాలు ఒక్కొక్కటీ నిర్దాక్షిణ్యంగా నేలకూలుతూంటే తన ఆక్రందనను ఆలకించిందీ, తనను ఓదార్చి కన్నీళ్ళు తుడిచిందీ రేణుకే. కానీ తనకీ ఓదార్పూ ఎన్నో ఏళ్ళు దక్క లేదు. రేణుక పెళ్ళయి వెళ్ళిన దగ్గర్నుండీ తను ఒంటరిదయిపోయింది. పోరాడేందుకు... ప్రతిఘటించేందుకు శక్తిలేని లేడికూనలా గానుగెద్దు బ్రతుకులో ముడుచుకుని పోయింది. ఆలోచనల ద్వారాల్ని బలవంతాన మూసుకుని, గాలిపాడితే, కాంతి ఆడితే ప్రతిస్పందించి పరవశించిపోయే తను జడపదార్థంలా మారిపోయింది. పుస్తకం చదవకపోతే ప్రాణం పోతున్నట్లు భావించే తనకు పాశవికంగా పుస్తకాల్ని అందకుండా చేసినప్పుడూ, "పుస్తకాలు చదివితే చెడిపోతావు, బరి తెగిస్తావు" అని తూలనాడినప్పుడూ నిశ్శబ్దంగా రోదించిందే తప్ప ధైర్యంగా ఎదిరించ లేకపోయింది.

"వదినా! మున్నీ ఆఫీసుకు వెళ్ళిందా?" ఆలోచనలను విదిలించుకుని అడిగింది రేణుక. ఆమె ప్రశ్నతో భవాని ముఖంలో విచారం కమ్ముకుంది. నెల రోజుల క్రితం తన చేతుల్లో ఆఖరి శ్వాస వదిలిన తన మనవడు గుర్తుకొచ్చాడు.

"మున్నీ యింకా ఆఫీసుకు వెళ్ళడం లేదు రేణూ!" భవాని కళ్ళలో తడి. రేణుకను కాదంబరి వున్న రూమ్‌లోకి తీసుకువెళ్ళింది.

"అత్తయ్యా!" అంటూ రేణుక ఒడిలో తల పెట్టుకుని బావురుమంది కాదంబరి. తల నిమురుతూ, ధైర్యం చెప్తూ మనిషి బ్రతుకు ఎంత అశాశ్వతమయిందో చెప్తూ మేనకోడలిని ఓదార్చడానికి ప్రయత్నిస్తోంది రేణుక. ఆమె ఓదార్పుతో కాదంబరి దుఃఖం కొంత ఉపశమించినా యింకా కొడుకు ముద్దు మాటల్ని, కొంటె చేష్టల్ని గుర్తుకు తెచ్చుకుని తెరలు తెరలుగా ఏడుస్తోంది.

ఇంట్లో పనంతా చక్క బెట్టి బయటికి వెళ్ళడానికి చీర మార్చుకుని వచ్చింది భవాని.

"రేణూ నేను కొంచెం పనుండి బయటకు వెళ్తున్నాను. తరువాత కలుద్దాం" హడావుడిగా బయటకు వెళ్తున్న తల్లి వంక కాదంబరి కఠినంగా చూడడం రేణుక దృష్టిని దాటిపోలేదు. అంతవరకు దీనంగా ఏడుస్తున్న కాదంబరి స్వరంలో అకస్మాత్తుగా కరకుదనం చోటుచేసుకుంది.

"ఇక్కడ పుట్టెడు దుఃఖంలో వున్న నన్నొదిలేసి బయట ఊరివాళ్ళనుద్ధరిం

చడానికి వెళ్ళింది. మా అమ్మ" నిష్ఠూరంగా చెప్తున్న కాదంబరి వంక ఆశ్చర్యంగా చూచింది రేణుక.

తన అన్న వున్నన్నాళ్ళూ అతను, పిల్లలే లోకంగా బ్రతికింది వదిన. అన్న పోయాక ఈ నాలుగేళ్ళ నుంచి పిల్లలకు ఎవరికి అవసరమొస్తే వారి దగ్గరకు వెళ్ళి సహాయం చేసి వస్తోంది. ఇల్లు, పిల్లలు, ఉద్యోగంతో పని చేసుకోలేక పోతున్నానని, అమ్మ దగ్గరవుంటే వెసులుబాటుగా వుంటుందని కాదంబరి ఈ ఊరుకు బదిలీ చేయించుకుని వచ్చినప్పటినుంచి ఆమెకు, ఆమె పిల్లలకు సకల సేవలూ చేస్తూ అన్నీ అమర్చి పెడుతోంది. యింకా తన తల్లి తనకు ఏం చెయ్యాలని యీ అమ్మాయి కోరిక? యింకా ఏమి చేయలేదని ఈమె కోపం?

భర్త వున్నంత వరకు స్వతంత్రంగా శ్వాసించడం కూడా మరిచిపోయిన వదిన ఇప్పుడిప్పుడే ఏ నిర్బంధాలూ లేకుండా స్వేచ్ఛగా ప్రపంచాన్ని చూడడానికి ప్రయత్నిస్తోందని తనకు తెలుసు. కానీ మున్నీ వాలకం చూస్తుంటే వదిన నిర్బంధాల బంధనాల్నుండి యింకా బయట పడలేదని అర్థమవుతోంది.

"నువ్వే చెప్పు అత్తయ్యా! ఇప్పుడు మీ వదిన ఆ 'ఓల్డ్ ఏజ్ హోమ్‌కి' వెళ్ళకపోతే కొంపలు మునిగిపోతాయా? అక్కడ వున్న వాళ్ళందరూ యీవిడ వెళ్ళి చూడకపోతే దిగులుతో చచ్చిపోతారా? బయటివాళ్ళ మెప్పులూ మెహర్బానీలూ వుంటే చాలు, యింట్లో వాళ్ళ ఏడుపులావిడకు పట్టవు." అక్కసుగా అంది కాదంబరి. ఆమెతో తర్కించడానికి మనస్కరించక కాసేపు కూర్చుని వెళ్ళిపోయింది రేణుక.

నాలుగు రోజులు పోయాక రేణుక యింటికి వెళ్ళింది భవాని.

"రేణూ! ఆరోజు నీతో కాసేపు మాట్లాడను కూడా మాట్లాడకుండా వెళ్ళిపోయాను. వృద్ధుల ఆశ్రమంలో ఒకావిడకు వాంతులు, విరేచనాలు, జ్వరంతో స్పృహ లేకుండా వుంది. ఆమె అందరూవుండీ దిక్కులేనిది. నేను చెయ్యగల సాయం చేద్దామని వెళ్ళాను" సంజాయిషీ యిస్తున్నట్లు చెప్తున్న వదిన చేతినందుకుని ఆమె నడుము చుట్టూ చెయ్యేసి ఇంట్లోకి నడిచింది. రేణుక స్పర్శతో భవాని మనసులోని గ్లాని తగ్గినట్లనిపించింది. రేణుక చేతిలో వున్న తన చేతినలాగే వుంచి ఆమె పక్కన సోఫాలో కూర్చుని చెప్పసాగింది భవాని.

'రేణూ! మీరీ వూరు వచ్చీరాగానే బాబు పోవడం, ఆ వెంటనే నువ్వు అబ్బాయి దగ్గరకు వెళ్ళడంతో నీతో సావకాశంగా కూర్చుని మాట్లాడడం కుదరనే

లేదు" రేణుకతో ఏదో చెప్పాలని ఆరాటం.

"యీ నాలుగురోజుల్నుండి నేను మళ్ళీ వద్దామని ప్రయత్నించినా ఎవరో ఒకరు రావడం, ఏదో ఒక పని... రాలేకపోయాను. సాయంకాలమయ్యే సరికి కీళ్లనొప్పులు... నీరసం... ముసలితనపు లక్షణాలొక్కొక్కటీ మొదలవుతున్నాయి." కాలి కీళ్ళవంక చూస్తూ చిన్నగా నవ్వింది రేణుక. రేణుక చెప్తూంది విని మందహాసంచేసిన భవాని ముఖంలో అంతలోనే నీలినీడలు పరచుకున్నాయి. ముసలితనం! అవును ముసలితనం పరుగు పరుగున వచ్చేస్తూంది. ఆలోచించ డానికి కూడా వ్యవధినివ్వకుండా తనను జీవితం యీదశకు తరిమింది. పని... ఊపిరాడని పని... ఏపాటి గుర్తింపూ, గౌరవంలేని పనితో సగంపైగా జీవితం గడిచిపోయింది. మిగిలిన ఈ కాస్త జీవితాన్ని మునుపటిలాగానే గడిపేయడానికి తనకు మనస్కరించడం లేదు. ఏదో చెయ్యాలన్న తపన, ఏదో సాధించాలన్న ఆరాటం, దేనికోసమో అన్వేషణ. తనలోని యీ మార్పు తన బిడ్డలకు సమ్మతం కావడం లేదు.

తన మనసులోదంతా రేణుకకు చెప్పుకొచ్చింది భవాని. "భార్యగా, తల్లిగా నేను నిర్వర్తించవలసిన కర్తవ్యాలనన్నిటినీ సాధ్యమైనంతవరకు ఏలోపం లేకుండానే నిర్వర్తించాననుకుంటున్నాను. పిల్లలకు నేను చెయ్యగలిగినందంతా చేసాను. యిప్పటికీ వాళ్లకు నా అవసరం కలిగితే సహాయపడడానికి సిద్ధంగా వున్నాను. అయినా మున్నీకి నేను గడపదాటితే కోపం" విచారంగా చెప్పింది భవాని.

"కొడుకు పోయిన దుఃఖం కొంత, నువ్వుకూడా బయటకు వెళ్ళిపోతే ఒంటరి తనంతో కలిగే దిగులుతో కొంత మున్నీ అలా అంటూ వుండుంటుంది వదినా" కాదంబరి అభ్యంతరానికి అది కారణం కాదని స్పష్టంగా తెలిసినప్పటికీ వదినకు సర్ది చెప్పడానికి ప్రయత్నించింది రేణుక.

"మున్నీ అయిష్టం యీనాటిది కాదు. బాబు పోకముందు నుంచి వుంది. తను చాలా అభ్యంతర పెట్టింది. అన్నలతో, అక్కలతో చెప్పించింది. యిప్పటి వరకు నా జీవితం నా ప్రమేయం లేకుండా గడిచిపోయింది రేణూ! మొట్టమొదటి సారి నేను స్వతంత్రించి తీసుకున్న నిర్ణయం యిది. యీ నిర్ణయాన్ని నేను మార్చు కోదలచు కొలేదు రేణూ! అయినా మున్నీ ఆఫీసుకు వెళ్ళకుండా ఏడుస్తూ పడుకుంటేనూ, నేను అనాధాశ్రమానికో, వృద్ధుల ఆశ్రమానికో వెళ్ళకుండా యింట్లో

వుంటేనూ పోయిన బిడ్డ తిరిగిరాడుకదా! నా చేతుల్తో నేను పెంచిన బిడ్డను పోగొట్టుకున్న దుఃఖం తీరదు కదా?! మన కర్తవ్యాల్ని మనం మరింత దీక్షతో నిర్వర్తించడంలోనే మన దుఃఖానికి ఉపశాంతి లభిస్తుందని నా బ్రతుకు నాకు నేర్పింది రేణూ" భవాని గొంతు గద్గదమయింది.

"నిజమే వదినా, దుఃఖాన్ని పదేపదే తలుచుకున్నందు వల్ల అది వృద్ధి అవుతుందే తప్ప తగ్గదు. అన్నయ్య చేసిన ఆగడాలకు, సంసారంలో నువ్వ నుభవించిన హింసకు, నువ్వీ సూత్రాన్ని ఆచరణలో పెట్టడం వల్లే బ్రతకగలిగావని, నీ కాపురాన్ని చక్కబెట్టుకురాగలిగావని నాకు తెలుసు. నువ్వు బాధపడకు. మున్నీతో మాట్లాడదాం. తనెంత తప్పు ధోరణిలో ఆలోచిస్తోందో తెలియజెప్పుదాం" రేణుక చెప్తూ వుండగానే ఆమె భర్త, చిన్న కొడుకు వచ్చారు. వాళ్ళతో కాసేపు మాట్లాడుతూ కూర్చుని వెళ్ళింది భవాని.

కొద్ది రోజులు పోయాక రేణుక మేనగోడలితో మాట్లాడదామని వచ్చింది.

"మీ వదినగారు ప్రొద్దుననగా అనాధాశ్రమానికి వెళ్ళింది. ఇంతవరకు యింటి ముఖం చూడలేదు." కాదంబరి మాటల ధోరణి చికాకు కలిగించింది రేణుకకు. కాదంబరి వంక తేరిపార చూచింది. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసి, ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఈమె చదువు ఈమె భావపరిధిని విశాలం చెయ్యలేకపోయింది. ఈమె ఉద్యోగం, సంపాదన - ఈమె ఫాషనబుల్ చీరలు, నగలు కొనుక్కోవడానికీ, యింట్లోకి లేటెస్ట్ వస్తువుల్ని కొనుక్కోవడానికీ ఉపయోగ పడుతోంది తప్పితే వ్యక్తిగా వికాసం చెందడానికీ, ఉన్నతమైన భావాల్ని పెంపొందించుకోవడానికీ, తన చుట్టూ తను వేసుకున్న స్వార్థపు ముళ్ల కంచెను దాటి విశాల ప్రపంచంలోకి స్నేహ దీపంతో అడుగిడడానికీ ఉపయోగపడడంలేదు. తల్లి తన జీవితంలో ఎంతటి నరకాన్ని చూచిందో, ఆమె ఎన్ని త్యాగాలు చేస్తే, ఎన్నిటికి హృదయాన్ని చంపుకుని లొంగిపోతే తామీ స్థితికి చేరారో ఎరిగివున్నా ఈమెకు తల్లి గురించి గౌరవంగా మాట్లాడే సంస్కారంకూడా లోపించిందే అని బాధపడింది రేణుక.

"వదినకు అక్కడకెళ్తే సంతోషం కలిగితే, వెళ్తే పోయిందేముందమ్మా?"

"ఎప్పుడో వారానికో, పదిరోజులకో ఒకసారి అయితే ఫరవాలేదు. ఈవిడ రోజూ అక్కడికి వెళ్ళి సేవలు చేసేయకపోతే ఆ ఆశ్రమాలు మరి నడవవా? దేనికైనా ఒక హద్దు వుండొద్దా." కాదంబరి వంక విస్మయంగా చూసింది రేణుక.

హద్దు! స్వీయ సుఖాల్ని త్యాగం చేసి పిల్లల కోసం, భర్త కోసం హారతి కర్పూరంలా కరిగిపోయిన వదిన తన సేవలకు, త్యాగాలకు 'హద్దు' గురించి ఎప్పుడైనా ఆలోచించిందా? ఆమెకు సంతోషం కలిగించే ఈ పనులకు మాత్రం ఆమె కడుపున పుట్టిన బిడ్డ హద్దులు విధిస్తోంది!

"యీ వయసులో ఆవిడకీ సంఘసేవలన్నీ ఎందుకత్తయ్యా? హాయిగా యింట్లో తిని కూర్చుని కృష్ణా, రామా అనుకోక ఎందుకివన్నీ? ఆవిడకేం తక్కువని?" కాదంబరి స్వరంలో అహం, అజ్ఞానం, దురుసుతనం.

"శరీరానికి అవసరమైనవేవీ తక్కువయివుండకపోవచ్చు. కాని వదిన మనసుకు కావలసిందేదో ఆ ఆశ్రమాల్లో దొరుకుతూ వుండి వుంటుంది. అమ్మను శాసించి బలవంతాన ఆమెకా ఆనందాన్ని దూరం చెయ్యడం న్యాయం కాదు మున్నీ! ఇంట్లో నీకే లోటూ రాకుండా చూచే వెళ్తూంది కదా, యింకా నీకెందు కావిడను అదుపు చెయ్యాలనే పట్టుదల?... వయసు మళ్ళినంత మాత్రాన ఆవిడకు స్వంత ఆలోచనలు, స్వంత కోరికలు వుండకూడదా? తన మనసుకు నచ్చిన పనుల్ని చేసే స్వేచ్ఛ ఆమెకుండకూడదా?" మేనత్త తల్లి పక్షాన మాట్లాడుతూ వాదనకు దిగేసరికి కొంచెం తగ్గింది కాదంబరి.

"ఆవిడను అదుపు చెయ్యాల్సిన అవసరం నాకేంటత్తయ్యా? అనవసరపు హైరానతో ఆరోగ్యం చెడి మూలపడితే యిప్పుడీవిడతో సేవలు చేయించుకుంటున్న వాళ్ళెవరైనా యిటు తొంగి చూడనైనా చూస్తారా?"

కాదంబరి ప్రశ్నల్ని విరక్తితో వింటోంది రేణుక. వదిన తను చేస్తున్న పనుల్ని ఏ ప్రతిఫలమూ ఆశించకుండా చేస్తూందని ఈ అజ్ఞానురాలు గుర్తించలేదా?... తల్లి ఆరోగ్యం పట్ల శ్రద్ధ, ఆమె మీద ప్రేమ కారణమయితే దానిని వ్యక్తపరచే విధానం మాత్రం యిది కాదు.

"నువ్వు సరిగ్గా ఆలోచించడంలేదు మున్నీ! నిజానికి అమ్మలో వస్తున్న యీ మంచి మార్పును నువ్వు ఆహ్వానించాలి. అమ్మ పరిధి యింటి నుంచి సమాజానికి విస్తరించింది. మీ తాత కూతురిగా, మీనాన్న భార్యగా, మీ అమ్మగా ఈమె గడిపిన జీవితానికేమీ ప్రత్యేకత లేకపోవచ్చు. కాని... తనలాంటి పది మంది పొద్దువాలిపోతున్న అశక్తులకు, దిక్కులేని, రెక్కలురాని కసుగాయలకు స్వాంతనను, సంతోషాన్ని పంచుతున్న ఆమె యిప్పటి జీవితానికి మాత్రం తప్పని సరిగా ప్రత్యేకత వుంది... నీకూ, నాకూ ఆమెకున్నంత త్యాగబుద్ధి లేకపోవచ్చు. కాని ఆమెని

అభినందించే, కనీసం సహించే పెద్దబుద్ధయినా వుండాలి కదా!'' రేణుక తర్కం విని కాదంబరి ఆలోచనలో పడింది.

“నువ్వు, నేను సంతోషంగా బ్రతుకుతున్నామంటే దానికి కారణం మన స్వేచ్ఛను మీ ఆయన, మా ఆయన ఎంతో కొంత ఆమోదించడమే. ఆడదాని స్వేచ్ఛ, సంతోషం మగవాడి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి వున్న సమాజంలో బ్రతుకుతూ, స్వేచ్ఛ రుచినెరిగిన నువ్వు మీ అమ్మ స్వేచ్ఛను అడ్డుకోవడం సబబా? చదువు, విజ్ఞత వున్న నువ్వు పురుషుని అధికారం నుండి స్త్రీకి విముక్తి జరిగేందుకు పోరాడే బదులు మరో స్త్రీ స్వేచ్ఛను హరించాలనుకోవడం సమంజసమా? ఆలోచించు'' రేణుక ప్రశ్నలతో కాదంబరిలో కలవరం ప్రారంభమైనా యింకా ఆమె కళ్ళ ముందున్న అజ్ఞానపు పొరలు పూర్తిగా విడిపోలేదు.

“అదికాదత్తయ్యా! అమ్మ ఒట్టిపిచ్చిది. ఆమె పిచ్చితనాన్ని ఆసరా చేసుకుని...'' కాదంబరి చెప్పబోతున్న దానిని చెప్పనివ్వకుండా అడ్డు పడింది రేణుక. ఎన్నో ఏళ్ళనుంచి ఆమె హృదయంలో దాగి వున్న ఆగ్రహం, దుఃఖం ఎగసివచ్చాయి.

“మీ అమ్మ పిచ్చిదా? కాదు. మీ అమ్మను మా అమ్మా, నాన్న, మీ నాన్న కలిసి పిచ్చిదాన్ని చేసారు. మీ అమ్మకున్న అమోఘమైన తెలివిని వాళ్ళ నాన్న మూర్ఖత్వం, పిరికితనం సగం మింగేసి 'పెళ్ళి' అనే బందిఖానాలో పెట్టాయి. మిగిలిన సగాన్ని మీ నాన్న మింగేసాడు... మీ అమ్మకున్న తెలివికి పై చదువులు చెప్పిస్తే దేశాన్ని కీర్తి శిఖరాల మీద కూర్చోబెట్టే గొప్ప సైంటిస్ట్ అయేది. సంగీతం నేర్పిస్తే గొప్పగాయని అయ్యేది. నాట్యం నేర్పిస్తే గొప్ప నర్తకి అయ్యేది. రచించనిస్తే గొప్పరచయిత్రి అయ్యేది. కానీ... మీనాన్న ఆమె తెలివిని పీల్చేసాడు. ఆయన బ్రతికున్నంత కాలం ఆమె జీవితాన్ని మరబొమ్మలా అనుభవించింది. యిప్పుడామె 'భవాని', కేవలం 'భవాని', తనలోని అనంతమైన కారుణ్యాన్నీ, ప్రేమనూ అందరికీ పంచుతున్న జగన్మాత.''

*-'కళాసాగర్' మద్రాస్, వార్షికోత్సవ సంచిక, 1994.*